# సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

## - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



**వర్ధన్నపేట, ఆగస్టు 14,(జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం బుధవారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ లోని వార్డులు, నూతనంగా నిర్మించిన అదనపు గదులను పరిశీలించారు. అనంతరం చికిత్స పొందుతున్న బాలింతలను మందలించి, సమస్యల పట్ల ఆరాతీశారు. కరెంట్ పోయినప్పుడు బాలింతలు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నట్లు కలెక్టర్ కి చెప్పుకున్నారు. ఈ సందర్భంగా బాధితుల కోసం ఒక జనరేటర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విధుల్లో ఎవరెవరు డాక్టర్లు ఉన్నారని సిబ్బందిని విచారించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మూర్తి లేకపోవడం గమనార్హం. అనంతరం హాస్పత్రికి చెందిన రికార్డులను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడుతూ ఏదైనా మౌళిక వసతులు కావాలంటే, డీసీహెచ్ఎస్ అధికారికి చెప్పి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పేషెంట్లకు అందించే భోజనం తయారు చేసే వంటగది, ఆహార పదార్థాలను పరిశీలించారు. ల్యాబ్ టెస్టింగ్ కోసం ఆహార పదార్థాల శాంపిల్ తీశారు. వంటగదికి చెందిన నిర్వాహకులకు పలు సలహాలు, సూచనలు అందించారు. వారి వెంట వర్ధన్నపేట తహశీల్దార్ విజయ్ సాగర్, ఏఆర్వో డాక్టర్ భరత్, వైద్యులు, స్టాఫ్ నర్సులు, తదితరులు ఉన్నారు.

### మొట్టమొదటిగా పరిశుభ్రతే సరిగాలేదు..

గత కొద్ది రోజుల క్రితమే వర్ధన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నర్సంపేట జిల్లా ఆస్పత్రి డిసిహెచ్ఎస్ డాక్టర్ గోపాల్ తనిఖీ చేశారు. కేవలం ఒక్క విద్యుత్ సమస్య పట్ల డాక్టర్లని మందలించి తిరిగి వెళ్ళిపోయారు. హాసుపత్రిలో ఉన్న సమస్యలపై పూర్తి స్థాయిలో పరిశీలిస్తే, ప్రతి సమస్య బయటపడుతుంది. మొట్టమొదటిగా హాస్పిటల్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రత లోపించిందన్న సంగతి గమనించాలి. బాలింతలు, అప్పుడే పుట్టిన చిన్నారులు ఉండే వార్డు ప్రక్కనే ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల కారణంగా దోమలు విపరీతంగా గదిలోకి చేరి వారిని చిత్రవధ చేస్తున్నాయి. ఈ కారణంగా చిన్నారులను దోమల భారీ నుంచి రక్షించుకోవడానికి బాలింతలు బలవంతంగా వీలు చేసుకుని, తమ పిల్లల్ని కాపాడుకునే దిశగా పిల్లలకు గాలి వీచే విధంగా క్లాతుల సహాయంతో తెల్లవార్లు
జాగారం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులపై ఆదేశాలు ఇచ్చి వెళ్లిపోవడం వల్ల ప్రయోజనం ఏముంటుందని హాస్పిటల్ పరిసరాల్లో బాధిత వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

### దూర ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులకు సరైన ఆహారం అందించాలి..

కొడకండ్ల మండలం రేగుల తండాకు చెందిన గుగులోతు వెంకన్న అనే వ్యక్తి తన భార్య ప్రసవం కోసం ప్రభుత్వ హాసుపత్రికి చేరుకున్నారు. వచ్చిన మరుసటి రోజే తన భార్య డెలివరీ అయ్యింది. అప్పటి నుంచి 5 రోజుల పాటు ఆయన ఆ పరిసరాల్లోనే ఉంటున్నారు. హాస్పిటల్ పరిసరాలను శుభ్రం చేయడం లేదు, దోమల బెడద తీవ్రంగా ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులపై కనికరం లేకుండా సరైన ఆహారం అందించడం లేదని వారు ఆవేదన చెందారు. ఇలాంటి పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిర్లక్ష్యపు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటేనే పరిస్థితులు చక్కబడతాయని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.











# నూతన బాధ్యతలు చేపట్టిన సీఐ రాజగోపాల్




పర్వతగిరి, ఆగస్టు14,(జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి సీఐ రాజగోపాల్ బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ నెల 12వ తేదీన వరంగల్ పోలీస్ కమిషనర్ పర్వతగిరి సిఐ శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్లిన అనిల్ కుమార్ లను సస్పెన్షన్ చేస్తూ, ఉత్తర్వులు జారీ చేశారు. పర్వతగిరి సిఐ శ్రీనివాస్ స్థానంలో రాజగోపాల్ బాధ్యతలు చేపట్టారు. సీఐ రాజగోపాల్ గతంలో ఖమ్మం జిల్లా కొత్తగూడెం, చర్ల, బయ్యారం, ఇల్లందు తదితర ప్రాంతాల్లో పనిచేసి, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నుంచి బదిలీపై పర్వతగిరికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది వారికి స్వాగతం తెలిపారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా

## - మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



రాయపర్తి, ఆగస్టు14,(జర్నలిస్ట్ వార్త): కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం మండలంలోని జగన్నాథపల్లి దుబ్బతండ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ కమల వెంకన్న అనారోగ్యంతో హనుమకొండలోని సంరక్ష హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి హాస్పిటల్ వెళ్లి, పార్టీ అధికారంలో లేకపోయినా దిగులు చెదవద్దు అన్నారు. కార్యకర్తల ప్రతీ కష్టంలో తాను ముందుంటానని బాధితునికి ధైర్యం చెప్పి పరామర్శించారు.

# బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాపాక ప్రశాంత్



రాయపర్తి, ఆగస్టు14,(జర్నలిస్ట్ వార్త): భారతీయ జనతా యువ మోర్చా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన రాపాక ప్రశాంత్ బుధవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ దేశం, ధర్మం కోసం పాటు పడుతున్న పార్టీలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవడం సంతోషంగా ఉందన్నారు. తాను గతములో బాల్యం నుండి స్వయం సేవక్ గా ఉంటూ, విద్యార్థి పరిషత్ లో సేవలు అందించి, అనంతరం బీజేవైఎం మండల అధ్యక్షుడిగా 2 పర్యాయాలు, బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా సేవలు చేశానని తెలిపారు. పార్టీ తనను గుర్తించి ఇప్పుడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిందని చెప్పారు. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను శ్రద్ధతో నిర్వహిస్తానని అన్నారు. రాబోయే రోజులలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ప్రతీ ఒక్కరినీ కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించి, పార్టీని బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా తమకు సహకరించినటువంటి బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు భరత్ వీర్, ఎస్సి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్, పాలకుర్తి అసెంబ్లీ అభ్యర్థి లేగా రామ్మోహన్ రెడ్డి, జనగామ ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పూసాల శ్రీమాన్, బీజేపీ ఎన్నికల కన్వీనర్ నూనె అనిల్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ ఎనగందుల శ్రావణ్ కుమార్, జిల్లా బీజేవైఎం నాయకులు సీస్సార్ వర్మ, సునీల్, బీజేపీ జిల్లా నాయకులు గడ్డం నరేందర్, బీజేపీ మండల అధ్యక్షులు వడ్లకొండ రవి, మండల సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





# కొత్తగా 223 పంచాయతీలు

**హైదరాబాద్ ఆగస్టు14,(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో కొత్త గా 223 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. కొత్త పంచాయతీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లాల అధికారులను ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు కొత్త పంచాయతీలకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. కొత్త పంచాయతీల ఏ ర్పాటుతో తెలంగాణలో పంచాయతీల సంఖ్య 12, 991కు చేరింది. ఇప్పటి వరకు 12,769 గ్రామ పంచాయతీలు ఉండేవి. కొత్తగా 223 పంచాయతీలను ఏర్పాటు చేశారు. అలాగే ఒక పంచాయతీని మున్సిపాల్టీగా ఏర్పాటు చేశారు. దీంతో పంచాయతీల సంఖ్య 12,991కు చేరింది.

**మున్సిపాలిటీగా ములుగు**

ములుగు మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త పంచాయతీల ఏర్పాటుతోపాటు ములుగును మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. కొత్తగా 223 గ్రామ పంచాయతీలను చేయాలని ప్రతిపాదిస్తూ అసెంబ్లీ, మండలి బిల్లును ఆమోదించాయి. ఆ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడంతో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

# పిడిఎస్ బియ్యం రవాణా అడ్డుకున్న పోలీసులు




వర్ధన్నపేట, ఆగస్టు14,(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు మండలం వనమాల కనపర్తి గ్రామ శివారులో ఆటో ట్రాలీ ద్వారా అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలి స్తున్న ఆటోట్రాలీని అడ్డుకున్నట్లు బుధవారం ఎస్సై పి. శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వారికి అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకోగా గుగులోతు రాజు, రేణుక రాజు అనేవారు పిడిఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. ఆటోట్రాలీ నెంబర్ టీస్ 08 యూజీ 6123 గల వాహనంలో బియ్యం బస్తాలు 59 ఉన్నాయి. సుమారుగా 25 కింటాలు ఉంటాయని తెలిపారు. వాటి విలువ 50 వేల వరకు ఉంటుందని వివరించారు. అక్రమంగా వీడియోస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సుంకిశాల ఘటనపై చర్యలు

**హైదరాబాద్ ఆగస్టు14,(జర్నలిస్ట్ వార్త):**
సుంకిశాల ఘటనపై తెలంగాణ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. సుంకిశాల ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌పై బదిలీ వేటు వేసింది. ఈ ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ సర్కిల్-3 అధికారులు సీజీఎం కిరణ్, జీఎం మరియరాజ్, డీజీఎం ప్రశాంత్, మేనేజర్ హరీశ్‌ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ కార్యదర్శి దానకిశోర్ ఆదేశాలు జారీ చేశారు. జలమండలి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సుంకిశాల పంపుహౌస్ రక్షణగోడ కూలిపోవడంతో పాటు పంపుహౌస్ పూర్తిగా నీట మునగడంపై అంతర్గత విచారణ జరిగింది. ఆ నివేదికను విచారణ కమిటీ ప్రభుత్వానికి అందజేసింది. దీంతో విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు సంబంధిత అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిర్మాణ సంస్థకు షోకాజ్ నోటీసు జారీ చేసింది.

# స్వచ్ఛదనం - పచ్చదనం పురోగతిపై

## - 33 జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

వరంగల్, ఆగస్టు 14,(జర్నలిస్ట్ వార్త): హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులు, 33 జిల్లాల కలెక్టర్లతో సీజనల్ వ్యాధులు, సంసిద్ధత, హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ వాటి పరిస్థితులు, స్వచ్ఛదనం - పచ్చదనం పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వరంగల్ కార్యాలయం నుంచి ఆయా శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వర్తించిన జిల్లాల కలెక్టర్లు, అధికారులను ఆమె అభినందించారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుధ్యం ముఖ్యమని, కిచెన్, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, డెంగీ, మలేరియా, అతిసారా వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పీహెచ్‌సీ డాక్టర్లు, ఆశా, ఎఎన్ఎం, సిబ్బంది క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాల కలెక్టర్లు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేసి, వసతులను మెరుగుపరచాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి మాట్లాడుతూ ప్రతీ జిల్లా స్థాయి అధికారి హాస్టల్, పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలను విధిగా తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు చేపట్టాలన్నారు.
ప్రతీ పాఠశాలలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు



చేపట్టాలని, ముఖ్యంగా దోమలు రాకుండా జాగ్రత్తలు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంటూ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని వైరల్ ఫీవర్, డెంగు, మలేరియా లాంటివి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గురుకుల పాఠశాలలో కళాశాలలో సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల పరీక్షల ఫలితాలు త్వరగా అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

